# సర్కిల్స్

ఉమన్స్ కాలేజీలో లంచ్ బ్రేక్ ఇచ్చారు.

సుబ్బలక్ష్మిని తనతోపాటు కాంటీనుకి రమ్మంది శిరీష. "అబ్బే, నువ్వెళ్ళిరా" అంది. దారిలో షమ్‌షాద్ కనిపించింది- "హాయ్" అని పలకరిస్తూ.

కాంటీనుకు రమ్మంది శిరీష. "విత్ ప్లెజర్" అంటూ బయలుదేరింది.

"అయితే, ఎమ్.ఎస్.సి. చదువుతారా మీరు?" అంది కుర్చీ లాక్కుంటూ షమ్‌షాద్.

"ఈ బి.ఎస్.సి. ఒకటి క్లాసుతో గట్టెక్కనీండి. పైగా సీటొకటి రావాలి కదా?" అంది శిరీష స్పూన్‌తో డిష్‌ని కెలుకుతూ.

"లీవ్ దెమ్ ఆల్ టు యువర్ డాడీ. మీ ఉద్దేశం చెప్పండి."

"మా బావ స్టేట్స్‌లో ఉన్నాడు కదండీ! మేరేజ్ చేసేసుకుని స్టేట్స్‌కి వెళ్లిపో, అంతగా కావాలంటే అక్కడ చదువుకుందువుగాని అంటున్నాడు మా డాడీ" - అంది శిరీష కాస్త సిగ్గుతో.

"కంగ్రాట్స్! మా బాబాకూడా ఉన్నారు. ఎందుకూ? దూరంగా మరో యూనివర్సిటీలో చదువుతానంటే ఒప్పుకోరు. పక్కనున్న ఆంధ్రాయూనివర్సిటీలోనే కావలిస్తే రీసెర్చి కూడా చేసుకో అంటారు. ప్చ్!" అంది షమ్‌షాద్.

"దూరంగా వెళ్ళిపోతే డిసిప్లిన్ ఎక్కడ పోతుందోనని మన పేరెంట్స్‌కి చెడ్డ భయం సుమండీ."

"అన్నట్టు- ది కమెండోస్‌తో ఫిఫ్త్ టెస్ట్ చూపిస్తున్నాడట. ఉయ్ షల్ నాట్ మిసిట్."

"సర్టెన్లీ."

కాంటీను నుండి తిరిగి క్లాసుకు వెళ్ళిపోబోతుంటే సుబ్బలక్ష్మి కలిసింది. మళ్ళీ. "వై డోంట్యూ జాయినిన్ ఎమ్మెస్సీ నెక్ట్స్ ఇయర్?" అంది శిరీష సుబ్బలక్ష్మితో. "పైగా క్లాస్ స్టూడెంటువి."

"నీకు తెలియందేముందే, శిరీషా? మా నాన్నచూస్తే బెడ్‌రిడెన్ అయిపోయారు. ఆయన పెన్షన్‌తో ఇల్లు, నీ హెల్ప్‌తో నా బి.ఎస్.సి. గడుపుకొస్తున్నాం. ఇదవగానే జాబ్ చూసుకుని మా నాన్న ఋణం, నీ ఋణం తీర్చుకోవాలి."

"డోంట్ బి సిల్లీ, సుబ్బూ. ఎంత సేపూ మీ నాన్న జబ్బూ, నాకివ్వాల్సిన డబ్బూ చెపుతావేం.... ఈక్వల్ ఆపర్చునిటీస్ గురించి మేం ఫైండౌట్ చేస్తూ ఉంటే?"

"వంటలూ, పెంటలూ వీటితో పాటు కాబోయే గుమాస్తా మొగుడూ,రాబోయే చీకిరి చీకిరి పిల్లలూ వీళ్లతో గిరిగీసుకుని ఆ సర్కిల్స్‌లోనే దిగబడి పోకపోతే, రాబోయే మరో ప్రపంచం గురించి బంగారు కలలు కంటూ మాలాగా ఎందుకు హాయిగా ఉండలేరు? మీలాంటి వాళ్లని ఏ గవర్నమెంటు మాత్రం ఉద్ధరించగలదు! ఇంకా ఇఫ్‌యూ డోంట్ థింక్ అదర్వైజ్ - సూబ్ లక్ష్మీ, ఐవాంట్ టు టెల్ యూ వన్ థింగ్. డబ్బంటే లేదన్నావు. కష్టాలన్నావు. బాగానే ఉంది. కాని మీ మీ పేర్లలో కూడా ఎందుకో మీ దరిద్రాన్ని రిఫ్లెక్ట్ చేసుకుంటారు?-- సుబ్బలక్ష్మీ, మంగతాయారూ, పార్వతీబాయి అంటూ. నన్నడిగితే గుక్క తిప్పుకోకుండా వందపేర్లు చెపుదును - అర్చనా, ఆరతీ, ఉషా, ఊర్మిళా" అంది షమ్‌షాద్ కనుబొమలు రెండూ తమాషాగా తిప్పుతూ.

"ఇంట్లో ఇబ్బందులు ఉంటాయి. మొన్న ప్రిన్సిపల్ చెప్పింది చూడు సోషలిజం గురించి, నేషనలైజేషన్ ఆఫ్ బాంక్స్, ఎబాలిషన్ ఆఫ్ ప్రివీపర్సెస్ -- స్టెప్ బై స్టెప్ సోషలిజానికి మెట్టెక్కుతూ ఉంటే మీ లాంటి వాళ్లు వెనక్కి మీ దరిద్రాల్లోకి లాగితే అదెలా సక్సెసవుతుంది ఇండియాలో" అని శిరీష అందుకుంది.

"ఎందుకే శిరీషా, సోషలిజం సోషలిజం అంటూ మంత్రాలు వల్లిస్తావు? సోషలిజంవల్ల మెట్లెక్కుతున్నది మీరు. మెట్లకింద ఉన్న మా ప్రాణాల్ని సోషలిజం పేరుతో తోడేస్తున్నారు మీరు. ఒక్కసారి తెర తొలిగించుకు చూడండి--లంచగొండితనమూ, అవినీతి ఎంతపెచ్చు పెరిగిపోయాయో. ముందు అవి పోగొట్టకుండా అరగంట ఉపన్యాసంలో ఆరువందల సార్లు సోషలిజం పేరు పలికితే అది రాదు. అంతెందుకు -- ఒక్కటి అడుగుతాను చెప్పు. బి.ఎస్.సి. వాడు బాంక్ లోనూ, బి.ఎ. వాడు ఫెర్టిలైజర్స్ లోనూ, బి.కామ్ వాడు బి.ఇడి. చదివి మాస్టారుగానూ పనిచేస్తున్నారంటే దీని అర్థం ఏమిటి?"

తళ తళ మెరుస్తున్న వాడిగా ఉన్న కత్తితో ఎర్రగా ఉన్న ఏపిల్ పండును ఛరక్‌మని తెగ్గొట్టినట్లు తుళ్లిపడింది శిరీష. ఇన్ని ఎర్రని దానిమ్మగింజలు ఒక్కసారిగా నోట్లో వేసుకు చప్పరించి తుపుక్కున ఉమ్మేసిన గింజల్లా తెల్లబడిపోయింది షమ్‌షాద్.

"శిరీషా, ఇలాంటి వాళ్లకి సోషలిజం తెచ్చి దోసిట్లో పోసినా నిలుపుకోగలరటండీ? మనలాగా నైడర్ సర్కిల్స్ ఉండవు వాళ్లకి. దేశంలో పరిస్థితులూ, సోషలిజం మనం ఆలోచిస్తూంటే, సొంత కష్టాలూ, నష్టాలూ ఆలోచిస్తారు వీళ్లు. అందుకే లీవ్ దెమ్ టు దెయిరోన్ ఫేట్. సోషలిజానికీ, బి.ఎ., బి.కామ్.లు చదివినవాటికీ సంబంధం ఏమిటో నాకు తెలీలేదు కానీ, తలనొప్పి మాత్రం దండిగా కొట్టుకొచ్చింది. ఇక క్లాసులు లాభంలేదు. ది కమెండోస్‌కి మాట్నీకి పోదాం, ఇఫ్ యూ లైక్ ఇట్" అంది షమ్‌షాద్ అలసటగా. ఆమాట వినగానే శిరీషకి ప్రాణం లేచివచ్చింది. "ఆయ్ రాదర్ లవిట్" అంటూ షమ్‌షాద్ వాళ్ల కారు ఎక్కింది. మధ్యతరగతి ప్రతినిధిలా నిర్లిప్తంగా నిలుచుండిపోయిన సుబ్బలక్ష్మి కళ్లలో సోషలిజంలా దుమ్ము కొట్టింది కారు. చక్కా అందరూ కార్లలో తిరిగితే దుమ్ము కళ్లలో పడదుగా అని అమాయకంగా కలలు కంటూన్న శిరీషను డిస్టర్బ్ చెయ్యకుండా తీసుకు వెళ్లిందా సోషలిజం లాంటి కారు.

★ ★ ★

గరల్స్ హైస్కూల్లో రిసెస్ బెల్ కొట్టారు.

కారియర్లు తీసుకుని దూరంగా ఉన్న చెట్టు కిందికి పరుగెత్తారు సూర్యకాంతం, రమాదేవి. ఒక అయిదు నిమిషాలు పోయాక కారియరు మోసుకుంటూ పరుగెత్తుకుని వచ్చింది సత్యవతి. రెండు నిమిషాలు అలుపు తీర్చుకుని, "ఏంటమ్మా పిల్లా, ఒగ్గడియాగకూడదేంటి? ఈ సూర్యకాంతంకి మరీ ఇదమ్మా" అంది.

"నేనేం జేసేనేంటి? అయినా ఇప్పుడు మించిపోయిందేంటమ్మా? మేం అన్నాలు తినకుండా నీ కోసం చూస్తున్నాంగా" అంది సూర్యకాంతం.

"నాకు తెలుసునమ్మా -- నేను మైలతో వచ్చేసేననేగా? పోన్లే, మీకంత కుల్లుమోత్తునమయితే నాకేనేంటి బాధ? మీ ఊరినుండి మా ఊరెంత దూరమో మా ఊరినుండి మీ ఊరూ అంతే దూరం" అంటూ కొంచెం దూరంగా కూర్చుంది సత్యవతి, కారియర్ విప్పుతూ.

కసురుకాయలా ఉన్న జామకాయని ఎంగిలవకుండా పంచుకు తినడానికి తలుపుసందునపెట్టి చిదగ్గొట్టినట్టుగా కిరకిరలాడిపోయింది సూర్యకాంతం.

"ఈవేళటితో పదిరోజులై పోతుంది కదమ్మా, సత్యవతీ మీ పెద్దనాన్నగారు చచ్చిపోయి?" సత్యవతి ఎక్కడ మాటలు మానేస్తుందోనని భయపడి తనే మొదలెట్టింది సూర్యకాంతం. అయినా మాట్లాడకుండా అన్నం కలుపుకుతినడం మొదలెట్టింది సత్యవతి.

"పాపం పసివాడులో నటమ్మా-- ఆ పిల్లడు చాలా కష్టాలు పడతాడంట. పాపం, దేవికకి జబ్బంట. ఏడుపొచ్చేస్తాదంట. మా అక్కా వాళ్లెళ్ళేరు. రుమాళ్లన్నీ తడిసిపోయేయి" అంది రమాదేవి ఒక్కోముద్ద తింటూ ఒక్కో మాట చెపుతూ కళ్లింతింత చేసుకుని.

"అవునమ్మా. మా తమ్ముడూ చెప్పాడు. ఎడారిలో పాము ఆ పిల్లడి కళ్లల్లోకి విషం కక్కేస్తాదంట."

అంతవరకూ జరిగింది మరిచిపోయినట్టుంది సత్యవతి. ఇదే అదను కలిపెయ్యడానికని -- "అయితే, రేపు మాట్నీకి మనం ముగ్గురం వెళదామమ్మా" అంది సూర్యకాంతం.

అలాగే అనుకున్నారు ముగ్గురూ.

"అన్నట్లు, నీకు చెప్పలేదు గదమ్మా సత్యవతీ? మళ్లీ కోపం తెచ్చుకుంటావు. నాకు సంబంధం కుదిరిందమ్మా. మన టెన్త్ క్లాస్ పరీక్షలైపోయాక చేసేస్తారంట" అంది సూర్యకాంతం. ఒక్క పిసరు సిగ్గుపడ్డా అమాయకత్వంతో ఎవరికో పెళ్లవుతున్నట్లుగా అంది.

"ఏం చేస్తుంటాడే? ఎంత కట్నం?" కుతూహలంగా అడిగింది సత్యవతి.

"తాలూకా ఆఫీసులో గుమాస్తాంట. మూడు వేలు కట్నం ఇమ్మంటున్నారు. ఎక్కడయినా తల తాకట్టు పెట్టయినా గుండెలమీద కుంపటి దించుకోవాలి అంటున్నారు. మా నాన్న. చక్కా మీరే నయమే. చదూకుంటారు." అదోలా ఇదైపోయింది సూర్యకాంతం.

"లేదమ్మా కాంతం. మా పెదనాన్నగారు పోయారుకదే? మా పెద్దమ్మా, పిల్లలూ కూడా మా ఇంటికొచ్చేశారు. మరి నీ చదువాపెయ్యాలే అంటున్నారు మా ఇంట్లో. టైపన్నా నేర్చుకుంటే బాగుణ్ణు అని ఉంది నాకు" అంది సత్యవతి కుళాయి దగ్గర శుభ్రంగా కారియర్ తోముతూ.

"అయితే, రమాదేవి చదువుకుంటుంది కామోసు." కుళాయి గట్టుమీద నిలబడి రమాదేవి వంక అదోలా చూస్తూ అంది సూర్యకాంతం. అలా ఈర్ష్యగా చూసిన చూపు చూడనట్టే చూసినా, నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో తెలియక, పండాలో పండకూడదో తెలియక పలకబారిన మామిడికాయలా తెల్లగా తెల్లబడిపోయింది రమాదేవి.

"ఏమిటమ్మా గొప్ప! చెప్పకూడదా?" అంది సత్యవతి కారియర్ సర్దేస్తూ.

"నాకు... నాకు చదవాలనే ఉందమ్మా. నేనే పెద్దకూతుర్ని కదా? మిగతా

వాళ్ళంతా చెల్లెళ్ళు. ఏదేనా ఉద్యోగం దొరికి మా నాన్న సంపాదించే వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు కలపాలంటే చదువుకోవాలికదా?" మరింక ఏం చెప్పాలో తెలియక గబుక్కున వంగుని ముఖం చూపకుండా కారియర్ కడగడం మొదలెట్టింది రమాదేవి. గాలి తగలక కమిలిపోయిన గెలలోని అరటిపండులా అవస్థపడుతున్న రమాదేవికి సత్యవతి కొద్దిగా సందు ఇచ్చింది.

"నరసమ్మని చూశావేంటమ్మా పిల్లా ఈవేళ? ఎంత స్టైలు చేస్తుందో? ఒంటిమీద పైట ఉంచుకోదమ్మా. గుఱ్ఱం తోకలా జుత్తూ అదిన్నూ. మళ్ళీ వాళ్ళనాన్న బేంకు బంట్రోతట." చివరి మాటలు మెల్లిగా గొంతు తగ్గించి అంది సత్యవతి.

"వాళ్ళు ఏమిట్లో తెలుసునేంటమ్మా నీకు?" అనడిగింది రమాదేవి కుతూహలంగా. సూర్యకాంతం చెప్పేసరికి- "ఆహా. తెల్లగా ఉండి విరగబడి పోతూంటే ఇంకా బ్రామ్మలనుకున్నాను" అంది సత్యవతి.

భోజనాలైపోయినా ఆ చెట్టుకింద కూర్చుని మాట్లాడుకుంటూ ఉండి పోయిన వాళ్ళకి బెల్లు వినిపించినా వినిపించనట్టుగానే ఉంది. ఆ చెట్టునీడ వాళ్ళ ముగ్గురి చుట్టూ గుండ్రంగా పరుచుకుంది. వాళ్ళు ముగ్గురూ మెసిలే పరిసరాల్లాగా ఆ చెట్టు నీడా చాలా చిన్నదే. అది దాటి వాళ్ళు వెళ్ళలేకపోయినా అదే ఆనందంగా ఉన్నట్టుంది వాళ్ళకి!

★ ★ ★

మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో 'ఇంటిబెల్లు' కొట్టారు.

పాలోమని పిల్లలందరూ తోసుకుంటూ బయటి కొచ్చి ఐస్ ఫ్రూట్లమ్మే వాళ్ళమీదా, బటాణీలమ్మే వాళ్ళ మీదా మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు.

అయిదో క్లాసు నుండి అప్పలసూరమ్మా, నూకాలమ్మా నింపాదిగా బయటికొచ్చారు. రంగు రంగుల రకరకాల గౌన్లు వేసుకున్న ఖరీదైన పిల్లలందరూ చేతుల్లోని డబ్బులు నీళ్ళలాగా పారేసి ఏవేవో

కొనుక్కుతింటున్నారు. వాళ్ళ జట్టున్న పిల్లలకి కొంచెం కొంచెం పెట్టి వాళ్ళ చుట్టూ తిప్పుకుంటూ, జట్టులేని వాళ్ళకి ఎర చూపుతున్నారు డబ్బున్న పెద్దమనుషుల్లాగానే.

వరుసగా ఐస్ ఫ్రూట్లూ, బటాణీలూ, కాజాలూ, జీళ్ళూ - ఇవన్నీ చూస్తుంటే నూకాలుకి ఆరోజు పొద్దున్న గంజీనీళ్ళు తాగకుండా వచ్చేసినట్టు జ్ఞాపకమొచ్చింది.

ఇప్పుడింటికి వెళితే, అయ్య రిక్షా తొక్కోవటానికీ, అమ్మ కూలిపనిలోకీ వెళ్ళిపోయి ఉంటారనుకుంది నూకాలు.

“ఒలే, సూరీ... గుడిసె కెల్దారి, ఒస్తావేంటీ?” అనడిగింది నూకాలు

“ఏమి?”

“గెంజి తాగలేదే పొద్దున్న.”

తనని వెటకారించినట్టనిపించింది నూకాలుకి. అసలే నల్లగా ఉండే నూకాలు బుగ్గలమీద ఎర్రని సిగ్గు వచ్చి చేరడంతో నేరేడుపండు రంగులో మిలమిలలాడాయి.

“అవునూ, మీ బాబుకి సొంత రిక్షా ఉంది. మా అయ్య పగలల్లా రిక్షా లాగి షావుకారికి రెండున్నరిచ్చెయ్యాల. మిగతా డబ్బులు ఏపాటుంటాయి గనక? అందులోనే తాగేస్తాడు. రూపాయో, అద్దురూపాయో మా యమ్మకిస్తాడు” అంది మెల్లిమెల్లిగా.

“మీ యమ్మ కూలి తెస్తాది. మాయమ్మ కూలీ తేదుగదా? ఇంకా రోగమొకటి. అందులోనే తింటన్నావా లేదా?” నూకాలు మనసెక్కడ నొప్పించానో అని, ‘మేమూ మీస్థితిలోనే ఉన్నా’మని చెప్పడానికి అంది సూరమ్మ.

“ఇంతకీ వస్తావా, రావా? గెంజి ఉంటే తాగేసి బేగి వచ్చేద్దాం” అంది నూకాలు. ఇద్దరూ బయలుదేరారు.

"నేను అయిదో క్లాసు పేలయినా పాసయినా మానేసి ఎక్కడైనా కూలి పన్లోకి సేరదామనుకుంటన్నాను" అంది నూకాలు.

"ఏటి? అప్పుడే! నీకన్నేళ్ళే?" అంది సూరమ్మ.

"పద్కుండో... పన్నెండో." ఏదో లెక్కేసుకుని చెప్పింది నూకాలు.

"అన్నేటి ఉంటాయా నీకు!" ఆశ్చర్యంగా అడిగింది అప్పల సూరమ్మ సన్నగా, పొట్టిగా ఉండే నూకాలు వంక చూస్తూ. చెదిరిపోయి రిబ్బనుముక్క లేని చిన్న పొట్టి జడా, జారిపోతూన్న లాగు గౌనుకింద కనపడుతూ చిన్న ముఖంతో ఆరేడేళ్ళ పిల్లలా కనపడుతుంది నూకాలు.

"పస్టు పారం సదవ్వా?" అనడిగింది మళ్ళీ అప్పలసూరమ్మ.

"మాయమ్మ ఇదే సదవద్దన్నాది. మా యమ్మ మళ్ళీ కడుపుతో ఉన్నాది కదా? ఇది సదవంగానే మానేస్తానేమో... తమ్ముణ్ణి ఆడించటానికి ఉండిపోవాలి కదా? ఉప్పుడంటే మాయమ్మ వొట్టికెల్లిపోతంది"!

"మా బాబు పస్టు పారం సదువే అంటున్నాడు. మా యమ్మేమో దాని కెందుకు సదువు, మనువు సూడంటూ మంచంలోంచి మూల్గుతుంటాది" అన్నాది అప్పలసూరమ్మ. "అవునూ... మరిసిపోయాను ... రజని మైసుర్‌పాకో ఏదో తెచ్చుకుంది గావాల, నీకిచ్చిందేటి" అంది నూకాలు ముఖంలోకి చూస్తూ.

"మైసురుపాక్కాదు, చాక్లెట్లు. తన జట్టుండమని ఇచ్చింది. మాస్టారు లెక్కలు చెప్పారుకదా? సూపియ్యమన్నాది. తంతారు మాస్టారు, ఎలా గన్నాను. అంతే, చాక్లెట్టు లాక్కున్నాది" అంది నూకాలు.

"అంతా కులికిౖద్రవేనే రజనిది. అన్నేటుంటాయిగదా చాక్లెట్లు ఒక్కటంటే ఒక్కటి యిచ్చేస్తే ఏటి పోతాది?" అంది అప్పల సూరమ్మ, సోషలిజానికి చిన్న సూత్రం చెప్పినట్టుగా.

"ఉంటే మాత్రం ఇయ్యాలనుందేటి? ఆళ్ళ దయా ధర్మం. మన్లాటోళ్ళం

ఆళ్ల సుట్టూ తిరగాలని ఇస్తారు. ఆళ్ళ పన్లన్నీ సెయ్యాల. దాని కింతగద్దు చాక్లెట్లు సూపింతారు."

ధనస్వామ్యం ఎంత చిన్నతనంలో అర్థమైనా నూకాలు లాంటి వాళ్ళు ఆ 'పెద్దాళ్ళు' సృష్టించిన పరిధుల్లోనే తిరక్క తప్పదు. ఇదేదో పచ్చి కాయలా కొరుకుడు పడదు అప్పలసూరమ్మ లాంటి వాళ్ళకి. కొరుకుడు పడిందీ అంటే ఆ వగరులాంటి నిజాన్ని కక్కేయ్యాకా తప్పదు.

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 30-5-1973)*